17వ
నేటి దినపత్రిక
సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శుక్రవారం,9 ఫిబ్రవరి 2024


# ఆటో యూనియన్ భవనానికి తపన ఫౌండేషన్ చేయూత

**భీమడోలు,మేజర్‌న్యూస్:** ఆటో డ్రైవర్లు రహదారి భద్రత నియమాలను పాటించాలని, వ్యక్తిగత రక్షణతో పాటు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి కోరారు.. భీమడోలు శ్రీ వెంకటేశ్వర ఆటో యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు బాదర్వాడ కృష్ణమోహన్ రాజు ఆహ్వానం మేరకు గురువారం ఆయన పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులతో పాటు, బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు కార్యాలయానికి భవనం లేక ఆటో యూనియన్ సభ్యులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆటో యూనియన్ భవన నిర్మాణానికి 50వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులతోపాటు ఆటో యూనియన్ అధ్యక్షులు సీరా సాంబశివరావు ,ఇతర కార్యవర్గ సభ్యులు స్వీకరించారు. భవన నిర్మాణానికి విరాళాన్ని ఇచ్చిన గారపాటి సీతారామ చౌదరిని అభినందించారు. కృతజ్ఞతలు తెలియజేశారు . కార్యక్రమంలో బిజెపి నాయకులు జి ప్రసాద్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారులపై సమీక్షించిన సిఎస్ జవహర్ రెడ్డి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నేషనల్ హైవే పెండింగ్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు,జాయింట్ కలెక్టర్లతో గురువారం మధ్యాహ్నం విజయవాడ నుండి సమీక్ష నిర్వహించి దేశానిర్దేశం చేయగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌కె.ఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారుల పెండింగ్ అంశాలు రెవెన్యూ, అటవీ తదితర సంబంధిత శాఖలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ,రీసర్వే 3దశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు,ఆరోగ్యం, వైద్యం అండ్ కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ,పీ అండ్ ఆర్డీ, తాగునీరు, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్షించారు.సమావేశంలోజిల్లారెవెన్యూఅధికారి డి.పుష్పమణి, డిపివో టి.విశ్వనాథ శ్రీనివాస్,డి యం హెచ్ వో శర్మిష్ట,మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీజిల్లాకో ఆర్డినేటర్ డా.రాజీవ్,వివిధశాఖలఅధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 11న జరిగే రాష్ట్ర బీసీ సదస్సును విజయవంతం చేయండి

రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్,వీరవల్లి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వైఎస్ఆర్సిపి నాయకులు గొర్రెల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా గురువారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్ చేసి పళ్ళు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు శ్రీనివాస్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పుట్టినరోజు వేడుకల్లో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ రాంబాబు, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నాల శంకర్ తాళ్లూరు మురళి బిజెపి ఉభయగోదావరి జిల్లాల ఇన్చార్జి లక్కోజు సుజాత చిటికెన ప్రసాద్ తానేటి అజయ్, మండల నాగేశ్వర రావు, అప్పారావు, మల్లుల విజయ్, జొన్నడ శ్రీనివాస్‌తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన రాష్ట్ర బీసీ సదస్సును బీసీ సోదరులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కార్పొరేషన్ల ద్వారా ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలి

దేశం బీసీ కన్వీనర్ శ్రీనివాస్



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** వైయస్సార్ పార్టీ ప్రభుత్వం అట్టహాసంగా బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు,డైరెక్టర్లునినియమించింది. ఈ కార్పొరేషన్ల ద్వారా గత మూడేళ్లుగా ఈ వర్గాల ప్రయోజనాల కోసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ పెండ్ర శ్రీనివాస్ అన్నారు.గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి ఆ వర్గాలకు చెందవలసిన సొమ్మును ఇతర పథకాలకు మళ్లించి బీసీలకు ద్రోహం చేశారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వృత్తి పనులు చేసుకునే వారికి పరికరాలు అందజేసేవారని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీలను విస్మరించిందని అన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న ఈ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని చెబుతున్నారని, ఆయన చైర్మన్ అయిన తర్వాత ఆ వర్గాల అభివృద్ధి కోసం ఎన్ని కోట్లు తెచ్చారో వెళ్ళడిం చాలని డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో బీసీలకు చెందవలసిన సొమ్మును ఇతర వర్గాలకు ధారాధత్తం చేశారని అన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన చంద్రబాబు నాయుడు ను విమర్శించే హక్కు వైసీపీ నేతలకు లేదని శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీల కోసం జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ ప్రయోజనాలకు వాడుకున్నదనిఆయన ఆరోపించారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత బీసీ వర్గాలకు అత్యంత అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని త్వరలో గద్దింపుతారని ఆయన అన్నారు.

## ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో నీటి సరఫరా వేళలో మార్పు



**ఏలూరుకార్పొరేషన్,మేజర్‌న్యూస్:** ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రాంతాలలో నీటి సరఫరా వేళలో శనివారం నాడు మార్పు చేయడం జరిగిందని. శనివారం నుంచి నీటి సరఫరా సాయంత్రం 6:30కి నిమిషాలకు బదులుగా రాత్రి 8:30 నుంచి 9:30 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ మార్పును ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోఉన్నప్రతిఒక్కరూ గమనించ వలసిందిగా ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

# రూ.1600 కోట్లతో ఆలయాల అభివృద్ధి

గత ప్రభుత్వంలో దేవాలయాలు కూల్చేశారు
సీఎం జగన్ ప్రభుత్వంలో
వాటిని పునరుద్ధరించారు
దేవాలయాల ఉద్యోగులకు పదోన్నతులు
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ





**అమరావతి/తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళ పాలనలో దేవదాయ, ధర్మాదాయశాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన సంస్కరణలు దేవదాయ శాఖలో ఒక సువర్ణాధ్యాయం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో మంత్రి ఛాంబరులో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గడచిన ఐదేళ్ళ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సమర్థవంతంగా జరిగిందని, అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరిందని అన్నారు. ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేసిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శించడం బాధాకరమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక దేవాలయాలను కూల్చేయగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వాటిన్నంటిని పునరుద్ధరించడమే కాకుండా 4500కొత్తఆలయాలను నిర్మించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1600 కోట్ల వ్యయంతో ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు.

శ్రీశైలం దేవాలయంలో భక్తులకు సౌకర్యం కల్పించే దిశగా సాలమండపాలు నిర్మాణాలను త్వరలో ప్రారంభించనున్నామని తెలిపారు. విజయవాడలో ఇటీవల జరిగిన మహాలక్ష్మి యజ్ఞం ఫలితంగా కేంద్రం నుంచి నిధులు వరదల్లా పారాయన్నారు. 2018వరకు1621దేవాలయాలకు మాత్రమే ధూపదీప నైవేధ్యాల సౌకర్యం ఉండేదని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10వేల దేవాలయాల వరకు ధూపదీప నైవేధ్యాలు జరిగేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని తెలియజేసే విధంగా హిందూ ధర్మప్రచారపరిషత్‌ద్వారావార,మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అర్చక వెల్ఫేర్ బోర్డు, ఆగమ సలహామండలి, అర్చక ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేశామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అందుబాటు లోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ బుకింగ్ కోసం యాప్‌ను కూడా రూపొందించామన్నారు. దేవాలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎండోమెంట్ ఆస్తుల లీజు గడువు ముగిశాక ఖాళీ చేసే విధంగా ఒక చట్టాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. ఆ చట్టం ప్రకారం వారిని ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అర్చకులు పనిచేసే దేవాలయాలపరిధిలోవారికిఇళ్ళ స్థలాలు కేటాయించామన్నారు. అందులో భాగంగా ఇళ్ళు లేని పేద అర్చకులకు ఇళ్ళు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని చెప్పారు.

చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పదోన్నతులు కల్పించడమే కాకుండా ఆలయాల నిర్మాణాలలో క్వాలిటీనిపెంచేందుకుఇంజనీర్లను నియమిస్తున్నామన్నా రు. ప్రీ ఆడిట్ సిస్టంను అమల్లోకి తెచ్చింది వైసీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు, పదోన్నతులు కల్పించిన సందర్భాన్ని పురస్కరించుకుని పలు దేవాయాలకు చెందిన ఉద్యోగులు మంత్రి కొట్టు సత్యనారాయణ కు అభినందనలు తెలిపి గజమాలతో సత్కరించారు.

# డ్వాక్రా సృష్టికర్త చంద్రబాబు వస్తే నష్టం జరుగుద్దా ?

- మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



**పెనుమంత్ర, మేజర్‌న్యూస్ :** డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసింది చంద్రబాబు అని,ఆయన మళ్లీ వస్తే డ్వాక్రా మహిళలకు అన్యాయం జరుగుతుందని రంగనాథరాజు చెప్పటం హాస్యస్పదంగా ఉందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. సోమరాజు ఇల్లెందులపర్రు మల్లిపూడి గ్రామాల్లో ప్రజలవద్దకుపితానిఎన్నికల ప్రచార పాదయాత్రను నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.తన ఆఫీసుకు వెళ్తే నేరుగా ప్రజలతో మాట్లాడలేని ఎమ్మెల్యే రంగనాథరాజు నా చెల్లెమ్మలంటూ మాయ చేస్తున్నాడని మాజీ మంత్రి టీడీపీ పోలిట్ సభ్యులుపితానిసత్యనారాయణ మండిపడ్డారు. ఎమ్మెల్యే రంగనాథరాజు రైస్ మిల్లర్ ద్వారా ఇసుక మాఫియా లిక్కర్ మాఫియా దోచుకున్న సొమ్ము ఒక్కొక్కరికి రూ.20 వేల బంగారం వెండి పెట్టిన ప్రజలు రుణం తీరని పితాని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఆసరా కార్య క్రమానికి వచ్చి తిరిగి ప్రయాణంలో మృతి చెందిన పిల్లలను పరామర్శించలేదని అన్నారు.నవరత్నాల పేరట ప్రజలను మోసం చేసి దగాకోరు ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. ఇళ్ల పట్టాల పేరిట పేద ప్రజల డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు.ఈ లూటీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజవర్గ జనసేన సమన్వయకర్త చేగొండి సూర్య ప్రకాష్, తెలుగుదేశం మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, గూడూరు మురళి జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్ ఏఎంసి చైర్మన్‌లు సానబోయిన గోపాలకృష్ణ,నల్లిమిల్లి నర్సిరెడ్డి,మాజీ ఎంపీపీ కాసాని విజయ ప్రసాద్,టిడిపి అధ్యక్షులు గుబ్బల వెంకట,సత్యనారాయణ కార్యదర్శి నోచర్ల శివ శంకర్ జనసేన నాయకులు,తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాధ స్వామి ఊరేగింపు



**టి.నరసాపురం,మేజర్‌న్యూస్ :** చిన కాశీగా పిలువబడే టి.నరసాపురం గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణ విశాలాక్ష్మి సమేత కాశీ విశ్వేశ్వర దేవస్థానం నందు జగన్నాధుని రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించ బడింది. ఈ సందర్భంగా ఆలయకమిటీ చైర్మెన్ కమ్మిల రమేష్ రాజు,ఉత్సవకమిటీ అధ్యక్షులు పసుమర్తి రాము, పర్వతనేని మురళీ మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచారంలో భాగంగాకృష్ణాజిల్లా ముదినేపల్లి సమీపంలోని వడాలి జగన్నాథ స్వామి వారి ఊరేగింపు టి నరసాపురం రావడం ఆనందదాయకంఅన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాలయం ప్రాంగణంలో ఉన్న అన్నదాన భవనంలో రథోత్సవంలో పాల్గొన్నభక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఆలయ పూజారులు వినయ్ శర్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఆర్ఆర్ ఎంపీ నా..? ఎమ్మెల్యే నా..?

- అందరి చూపు ఆయన వైపే.
- ఆర్ఆర్ఆర్ అసెంబ్లీకి పోటీ చేస్తే
- ఎంపీ అభ్యర్థి ఎన్నారై కొవ్వలి నాయుడే నా...?
- కాబోయే హోమ్ మంత్రి ఆర్ఆర్ఆర్ అంటూ అనుచరుల హల్ చల్





**నర్సాపురం,మేజర్‌న్యూస్:** త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పొత్తులు కుదుర్చుకునేందుకు, ఎత్తులు వేసేందుకు రాజకీయ పార్టీలు బిజీబిజీగా ఉండగా పోటీ చేసేందుకు అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతూ ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆంధ్రప్రదేశ్ లోని నరసాపురం పార్లమెంటు స్థానానికి ఒక ప్రత్యేకత ఉంది. గతంలో ఈ స్థానం నుండి ఎంపీగా గెలిచిన సినీ నటుడు కృష్ణంరాజు కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. గడచిన పార్లమెంటు ఎన్నికల్లో ఈ స్థానం నుండి జనసేన పార్టీ ఎంపీ అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు బరిలో నిలిచి పరాజ్యం పొందారు. ప్రస్తుతం ఈస్థానంనుండిఎంపీగాఉన్నకనుమూరి రఘురామకృష్ణంరాజు వైయస్సార్ సీపీ తరపున గడచిన ఎన్నికలలో ఎంపీగా విజయం సాధించారు. కొంతకాలానికే పార్టీ అధినేత సీఎం జగన్మోహన్ రెడ్డితో ఆర్ఆర్ఆర్‌కు విభేదాలు రావడంతో రాష్ట్రంలో ఆయన గత నాలుగేళ్లుగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ జగన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ వచ్చారు. అదేవిధంగా ఆర్ఆర్ఆర్ అరెస్టు, విడుదల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైనది. ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తమను దూషించిన, దూషిస్తున్న ఆర్ఆర్ఆర్ ను ఎన్నికలలో ఓడించడమే ధ్యేయంగా అధికార వైఎస్ఆర్సిపి అధినాయకత్వం వ్యూహాలను రచిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతానికి వైయస్సార్సీపి నరసాపురం పార్లమెంటు సమన్వయకర్తగా శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది, మహిళా నాయకురాలు గూడూరి ఉమాబాల ను ఇటీవలే ప్రకటించారు. ఇదిలా ఉండగా. తనను ఇబ్బందులకు గురిచేసిన సీఎం జగన్ కు తగిన గుణపాఠం చెబుతానని,హోం మంత్రిగా భవిష్యత్తులో బాధ్యతలు చేపట్టి తనసత్తాచాటుతానని రచ్చబండ వేదికగా పలుమార్లు ఆర్ఆర్ఆర్ ప్రకటించిన విషయం విధితమే. ఈ దృష్ట్యా ఆర్ఆర్ఆర్ టిడిపి ,జనసేన బిజెపి కూటమి తరపున నరసాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారా? లేక భీమవరం లేదా ఉండి నియోజకవర్గాలలో ఏదో ఒక చోట నుండి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించడం ద్వారా రాష్ట్ర మంత్రివర్గం లో హోం మంత్రిగా బాధ్యతలు చేపడతారా? అని ఆయన అనుచరగణం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం భీమవరం ఎమ్మెల్యే గా గడచిన ఎన్నికలలో పవన్ కళ్యాణ్ ఓడించిన గ్రంధి శ్రీనివాస్ పనిచేస్తున్నారు. ఉండి నుండి టిడిపి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఉన్నారు. పైన పేర్కొన్న రెండు స్థానాల్లో ఒకచోట నుండి ఆర్ఆర్ఆర్ పోటీలో ఉంటే నరసాపురం కూటమి ఎంపీ అభ్యర్థి గా ఎన్నారై, కాపు నాయకుడు కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు బరిలో నిలుస్తారని గత రెండు రోజులుగా నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. వైయస్సార్ సిపి శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ కేటాయించినందున కాపు సామాజిక వర్గానికి చెందిన ఎన్ఆర్ఐ కొవ్వలి నాయుడు ఎంపీ బరిలో ఉంటే విజయం సునాయాసం అవుతుందని టిడిపి అధిష్టానం వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

## జిల్లా కలెక్టర్‌తో డిఇఓ వెంకట రమణ భేటీ



**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆర్.వెంకట రమణ గురువారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.వీరు ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాకు ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. వీరికి రెగ్యులర్ విద్యాశాఖ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ పశ్చిమగోదావరి జిల్లాకు నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరింత కష్టపడి పనిచేసి విద్యాశాఖలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. జరగబోవు పదవ తరగతి పరీక్ష ఫలితాలు మన పశ్చిమగోదావరి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానం నిలిపేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా డివిజనల్ విద్యా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు,సిబ్బంది డీఈవో ఆర్.వెంకట రమణకు అభినందనలు తెలిపారు.

## ఏటిగట్టు పనులపై విచారణ జరిపించాలి


'దేశం' నేతలు పొత్తూరి, కొవ్వలి



**నరసాపురం, మేజర్‌న్యూస్:** పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతంలో 26 కోట్లతో ఆధునికరిస్తున్న ఏటిగట్టు పనులు బుధవారం రాత్రి కృంగిపోయాయి. ఇప్పటికే రెండుసార్లు ఇలా జరగగా అధికారులు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు ఇలా జరగటం సర్వ సాధారణమని, పనులను నాణ్యత ప్రమాణాలతో చేపడతామని చెప్పారు.బుధవారంరాత్రి జరిగిన సంఘటన పట్టణవాసులను కలవరానికి గురిచేస్తుంది. రెండుసార్లు కుంగిపోయినప్పటికీ, మళ్లీ పునరావృతం కావటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, ఆపార్టీ యువ నాయకుడు కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి పనులపై ఆందోళన వ్యక్తం చేశారు. రెండుసార్లు కుంగిపోయినప్పటికీ చిత్తశుద్ధి లేకుండా చేపడుతున్నారని అన్నారు. నాణ్యత ప్రమాణాలకు తిలో దకాల ఇచ్చి జరుగుతున్న పనులపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జక్కం శ్రీమన్నారాయణ,వాతాడి ఉమామహేశ్వరరావు, బర్రె మురళి, కొల్లు పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

## ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం

– టిడిపి నేత కాపా శ్రీనివాసరావు



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన ఆశా వర్కర్లపై పోలీసుల లాఠీచార్జ్ జగన్ రెడ్డి నియంతృత్వ పాలనకు పరాకాష్టఅని, ఆశాలపై లాఠీచార్జ్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రావిచెర్ల గ్రామ సర్పంచ్‌కాపా శ్రీనివాస రావు చెప్పారు. గురువారం అయన విలేఖరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా ఆశాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నజగన్‌రెడ్డివారి సమస్యల ను పరిష్కరించకపోవడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. ఆశాలకు రూ.10 వేల జీతం ఇస్తానని ముఖ్యమంత్రిగా మొదటి సంతకం చేసిన జగన్ రెడ్డి హామీ ఎందుకు నిలబెట్టుకోలేదు? టీడీపీ హయాంలో అంగన్వాడీలకు జీతాలు పెంచి చంద్రబాబు ఉద్యోగ భద్రత కల్పిస్తే, జగన్ రెడ్డి ఆదాయ పరిమితి నిబంధనతోవారిని సంక్షేమానికి దూరం చేయడం నమ్మించి వంచించడం అనిఅన్నారు. ఉద్యోగభద్రత కల్పించకుండా, శెలవులు ఇవ్వకుండా, పనిభారంతో ఒత్తిడి పెంచితే నిరనస తెలిపే హక్కు ఆశాలకు ఉందన్నారు. క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, శిశువులను వైద్యమందేలా చూసే ఆశా వర్కర్లపై జగన్ రెడ్డి కక్ష కట్టడం అమానుషమని, తక్షణమే ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## 12న జిల్లా డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఆఫీసు గౌతమీ సమావేశపు హాలులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024వ సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక,గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యలు,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించడం జరుగుతుందన్నారు.

సూర్య
పశ్చిమ గోదావరి
శుక్రవారం
9 ఫిబ్రవరి 2024
2

# 11న అమలోద్భవి మాత కథీడ్రల్ 36వ వార్షికోత్సవం



**ఏలూరు, మేజర్ న్యూస్:** ఏలూరు జేవియర్ నగర్ లోని అమలోద్భవి మాత కథీడ్రల్ మహా దేవాలయం 36వ ప్రతిష్టాపన వార్షికోత్సవం, లూర్దు మాత మహోత్సవములు ఈనెల 11వ తేదీ ఆదివారం జరుగుతాయని ప్యారిష్ ప్రీస్ట్ రెవ.ఫాదర్ ఐ. మైఖేల్, సహాయక గురువు ఎ.రాకేష్ తెలిపారు. 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 5:30 గంటలకు మరియ తల్లి స్వరూపంతో సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుండి కథీడ్రల్ దేవాలయం వరకు ఊరేగింపు ఉంటుందని, 6:30 గంటలకు సమిష్టి దివ్య బలిపూజ ఉంటుందన్నారు. ఈ పూజలో బిషప్ పొలిమేర జయరావు ముఖ్య ప్రసంగం చేస్తారని, జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని ఫాదర్ మైఖేల్ తెలిపారు. రాత్రి 9 గంటల నుండి సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శిస్తారని వివరించారు.

# ముదినేపల్లి పోలీసుల అదుపులో ఆశా వర్కర్లు



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** చలో విజయవాడకు వెళుతున్న ఆశా వర్కర్లను విజయవాడలో అడ్డుకొని ముదినేపల్లిలో వి కన్వెన్షన్ హాల్ కు తరలించారు. తమ సమస్యల పరిష్కారం కోసం పలు ప్రాంతాల నుండి బస్సుల్లో విజయవాడ ధర్నా కు వెళుతున్నారు. ఈ క్రమంలో అన్ని ప్రాంతాల నుండి వెళ్తున్న ఆశ వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని పలు ప్రాంతాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. మధ్యాహ్నం రెండు గంటలకు పంపి వేశారు. ముదినేపల్లి ఏఎస్ఐ పద్మావతి, మహిళా కానిస్టేబుళ్లు పర్యవేక్షించారు.

# ధాన్యం విక్రయించడానికి రైతులకు ఆందోళన వద్దు

**జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్ళు ప్రక్రియ ప్రారంభించి దాదాపుగా 90 రోజులు గడిచిన కారణంగా,రోజువారీ కొనుగోళ్లు బాగా తగ్గినందున కొనుగోల్ ప్రక్రియ ముగించదలచి రైతులు వద్ద మిగిలియున్న ధాన్యమును ఈనెల 15వ తేదీలోపు సంబంధిత రైతు భరోసా కేంద్రముల వద్ద విక్రయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు.

ఏదైనా మండలాలలో రైతులు అపరాలు సాగు చేస్తున్న కారణంగా వరి కుప్పలు నూర్పిళ్లు చేయడం ఆలస్యమవుచున్నచో,అట్టి మిగులు ధాన్యమును రబీ సీజన్ లో లేట్ ఖరీఫ్ క్రింద కొనుగోలు చేయుటకు ప్రతిపాదనలు సంబందిత అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. కావున జిల్లా లోని రైతులందరు ఆలస్యముగా నూర్పిళ్లు చేసుకునే ధాన్యమును విక్రయించడానికి ఎటువంటి ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు.జిల్లాలో ఖరీఫ పంట కాలమునకు సంబంధించి,ధాన్యం సేకరణ ప్రక్రియకు జిల్లాలో 261 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి 133 కొనుగోలు సహాయక కేంద్రాల ద్వారా గత ఏడాది నవంబరు 10వ తేదీ నుండి ప్రారంభించబడి ఈనెల 7వ తేదీకి 41 వేల 570 మంది రైతుల నుంచి 712.17 కోట్ల రూపాయల విలువైన 3లక్షల26 వేల 005 మెట్రిక్ టన్నుల ధాన్యమును కనీస మద్దతు ధరకు రైతుల నుండి సేకరించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 657.85కోట్ల రూపాయలు రైతుల వ్యక్తిగత ఖాతాకు జమ జేయడం జరిగిందని, మిగిలిన 53.59 కోట్ల రూపాయలు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు.

## ఆర్‌డిఓకి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ సర్పంచ్



**కైకలూరు, మేజర్ న్యూస్:** జగనన్న తలపెట్టిన పేదవారికి ఇంటి పట్టాలు కార్యక్రమానికి సంబంధించి, కైకలూరు మండలం లో మంజూరైన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లను పరిశీలించడానికి వచ్చిన ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కాజావలి ని, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవ రత్న కుమారి కలిసి జగనన్న గ్రీన్ విలేజ్ లో మూడు వేల మందికి పైగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటీవల కైకలూరు తహసీల్దార్ గా బదిలీ పై వచ్చిన ఎస్.పోతురాజు ని మర్యాద పూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

## బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా సొంటి రామకృష్ణ నియమకం



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** జనసేన పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులుగా సొంటి రామకృష్ణ ను నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజ కవర్గ ఇన్చార్జి చిర్రి బాలరాజు నాయక త్వంలో నడిచే ఒదుకు నాకు ఈ అవకాశం కల్పించిన జనసేన నాయకు లందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.జనసేన పార్టీ బలోపేతం చేసేందుకు మండలంలోని బీసీలందరినీ చైతన్యం చేస్తానని అన్నారు. రానున్న ఎన్నికలలో చిర్రిబాలరాజు గెలుపుకు బీసీలంతా ఐక్యంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పేకాట శిబిరంపై దాడులు



**కైకలూరు, మేజర్‌న్యూస్:** కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ ఆకుల రఘు కి, రాబడిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ వారి సిబ్బందితో కలిసి కైకలూరు సంత మార్కెట్‌లో పేకాట శిబిరం పై దాడులు నిర్వహిం చినారు. పది మందిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 26,500 స్వాధీనం చేసుకొని వారిపై కైకలూరు టౌన్‌లో కేసు నమో దు చేశామని ఒక ప్రకటనలో సీఐ రఘు తెలిపారు.

## విజయవాడ వెళ్తున్న ఆశా వర్కర్లను అడ్డుకున్న పోలీసులు



**భీమడోలు,మేజర్ న్యూస్ :** సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ ధర్నాకు వెళ్ళుతున్న ఆశా కార్యకర్తలపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. గురువారం నిర్వహించే ధర్నాకు వెళ్లేం దుకు సిద్ధమవుతున్న ఆశా కార్యకర్తల కోసం పోలీసులు రాత్రి నుంచి వెతకడం ప్రారంభించారని సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు ,ఉంగుటూరు ,ద్వారకాతిరుమల మండలాల్లో ఆశా కార్యకర్తలపై నిర్బంధం కొనసాగిందని తెలిపారు. భీమడోలు మండలంలోని గుండుగొలను, పూళ్ళ తోపాటు భీమడోలు పరిసర ప్రాంతాలలోని గ్రామాల నుంచి భీమడోలు స్టేషన్ కు చేరుకొని రైలు ద్వారా విజయవాడ వెళ్ళేందుకు సిద్ధమైన సుమారు 50 మంది ఆశా కార్యకర్తలను భీమడోలు పోలీసులు అదుపులోనికి తీసుకొన్నారు. పోలీస్ స్టేషన్‌కు గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తరలించారు.ఆశా కార్యకర్తలు అక్కడే తమ ఆందోళన కార్యక్ర మాన్ని కొనసాగించారు. వీరికి సంఘీభావం తెలిపేందుకు సిఐట యు జిల్లా అధ్యక్షులు లింగరాజు అక్కడ చేరుకొని ప్రసంగించారు. ఆశాలు చేపట్టిన ఆందోళనకు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు ,వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు ఎం వీర్రాజు, సిపిఎం నాయకులు పాలికొండ నాగరాజు ,గుర్రాల పాపారావుమద్దతు తెలిపారు.సంఘీభావం తెలియజేశారు.


## పదోన్నతి పొందిన డీఈవో రమణకు సత్కారం





**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఇప్పటివరకు ఇన్చార్జి డిఈఓగా కొనసాగుతూ డీఈఓగా పదోన్నతి పొందిన ఆర్వి రమణను నరసాపురంలోవివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిఘనంగా సత్కరించారు.గురువారం స్థానిక మిషన్ హై స్కూల్ ఆడిటోరియంలో మున్సిపల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా అభ్యాసం చేయాలని, ఆలోచనతో చదివితే బాగా అర్థమవుతాయని అన్నారు. పరీక్షలకు ఎక్కువ కాలం లేనందున ఇప్పటి నుండే దృష్టి సారించాలని నరసాపురంలోని పాఠశాలలు, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం వివిధ పాఠ శాల చెందిన ప్రధానోపాధ్యాయులు రమణకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పి పుష్పరాజ్యం, జాను ప్రభాకర్, కేజీహెచ్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నల్లం రాజు, శ్రీదేవి, నీరజ, అంజిబాబు, సూర్య కుమారి,గీతా బాల పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి విద్యార్థి సిద్దేశి కార్తీక్ ప్రతిభ



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :**"నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్"కోసం రాసిన పరీక్షలో ఏలూరు జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన సిద్దేశి కార్తీక్‌ను ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినంది ంచారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న సిద్దేశి కార్తీక్ జీలుగుమిల్లిలోని రామన్నపాలెం కాలనీకి చెందిన విద్యార్థి. 2008 సంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన స్కీమ్‌ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారై,చదువులో చురుకు గా ఉండే విద్యార్థుల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 8 వ. తరగతి నుండి 12 వ తరగతి వరకు ఈ స్కాలర్ షిప్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్తీకు జిల్లా ప్రథమ స్థానం రావడం మన గ్రామానికి చదివిన పాఠశాల కు కన్న తల్లి తండ్రులు గర్వ పడేలా చేసిన కార్తీక్ మరిన్ని విజయాలు అందుకోవాలని అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు దీవించారు.

# వైసిపి నిర్బంధ,అప్రజాస్వామిక వైఖరి విడనాడాలి

**– లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు : సిపిఎం నేత ఎ.రవి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** వైసిపి నిర్బంధ, అప్రజాస్వామిక వైఖరిని విడనాడకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే గట్టి బుద్ధి చెబుతారని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్క రించాలని కోరుతూ ఆశా వర్కర్లు నిర్వహించే ఛలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బుధవారం నుండే జిల్లాలో పోలీ సులు ఆశ వర్కర్లతోపాటు సిఐటియు, సిపిఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులకు నోటీసు ఇచ్చి నిర్బంధించారని,బుధవారం అర్ధరాత్రి నుండే ఇండ్ల వద్దకు వచ్చి దౌర్జన్యంగా అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ విధానాలు రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి అద్దం పడుతోందని దుయ్యాబట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్,కలిదిండిమండలకార్యదర్శి ఎస్.మహాంకాళీరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్, ఇతరనాయకులు బి.సోమయ్య, ఏ.శ్యామల రాణి, బి.జగన్నాధరావు, పి.గోపి, వేలేరుపాడు మండల సిఐటియు నాయకులు ఎం.దుర్గారావు, కుక్కునూరు సిఐటి నాయకులు సాయి తదితర నాయకులను, ఆశ వర్కర్లను బుధవారం అర్ధరాత్రి నుండి అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారని తెలిపారు. మధ్యాహ్నం కావడంతో భోజన ఏర్పాట్లు చేయమని ఆశా వర్కర్లు పోలీసులను కోరడంతో అక్కడే ఉన్న నూజివీడు పట్టణ సిఐ కోపంతో వళ్లు బలిసి రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేస్తున్న మీకు భోజనాలు కావాలాఅని దుర్భాషలాడటాన్ని ఖండించిన నూజివీడు మండల సిపిఎం నాయకులు, రైతుసంఘంజిల్లా అధ్యక్షులైన ఎన్.నర్సింహపై దూసుకొని వచ్చి దురుసుగా ప్రవర్తించడం చూస్తే పోలీసు అధికారిగా కాకుండా వైసిపి కార్యకర్తగా సీఐ వ్యవహరించారని ఆరోపించారు.

## ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన



**పెదవేగి, మేజర్ న్యూస్:**రహదారి కూడళ్ళను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ వై.సురేష్ బాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కలిగి ఉండటం వలన రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చునన్నారు. మనం వాహనాలను ఎంత సక్రమముగా నడుపుతున్నప్పటికీ ఊహించని ప్రమాదాలు ఎన్నో పొంచి ఉంటాయని, చాల మెలకువతో వ్యవహరించినప్పుడు మాత్రమే ప్రమాదాలను నివారించ వచ్చునన్నారు.ఈ కార్యక్రమములో రోడ్డు భద్రతా వైద్యురాలు జి. మౌనిక, కళాశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మానవతాసంస్థ ప్రోత్సాహం



**భీమడోలు, మేజర్ న్యూస్ :** విద్యార్థి భవిష్యత్ నిర్మాణంలో కీలకపాత్ర వహించే పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వివిధ రూపాల్లో సహాయం అందించేందుకు ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థ మానవత సేవలు వినియోగించుకోవాలని, సమస్త జిల్లా కన్వీనర్ రామిశెట్టి గంగాధర రావు, కెరియర్ గైడెన్స్ విభాగం జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమా మహేశ్వర రావు కోరారు. గురువారం మండలంలోని ఆగడాల లంక, గుండుగొలను హై స్కూల్ లలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉమామహేశ్వరరావు కెరియర్ గైడెన్స్ అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత స్థాయి భవిష్యత్ కోసం నిర్ణయించుకోవలసిన లక్ష్యాలు, వాటి సాధనకు చేయవలసిన కృషి ,ఇతర అంశాల గురించి వివరించారు. అనంతరం సంస్థ తరపున విద్యాపరంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. దీనిలో భాగంగా గుండుగొలను హైస్కూల్లో ఆంగ్ల మాధ్యంలో చదువుతూ ప్రథమ ,ద్వితీయ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు బి రాజేష్, ప్రీతి వర్ధిని లకునగదు ప్రోత్సాహకాలు, ఇదే విధంగా తెలుగు మాధ్యమంతో ప్రథమ ,ద్వితీయ స్థానాలను దక్కించుకున్న విద్యార్థులు ఎం.పద్మారాణి , వై లలితా దేవి లకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఇదేవిధంగా ఆగడాల లంక హైస్కూల్లో తెలుగు మాధ్యమంతో చదువుతూ ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్న విద్యార్థులు బి .ప్రశాంతి, ఎస్ ప్రహర్ష లకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు .వీరందరికీ సంస్థ తరపున పదవ తరగతి స్టడీ మెటీరియల్ , నిఘంటువులు ,మెరిట్ సర్టిఫికెట్లు మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఇతర వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు తాము ఎంచుకున్న మాధ్యమాలతో పనిలేదని , తమకు ఆసక్తిగల మాధ్యమాలతో శ్రద్ధాసక్తులతో చదివి , కృషి పట్టుదల లతో ఉన్నత స్థానాలకు చేరవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు శాఖ చైర్మన్ గుళ్ళ నూకరాజు ,మండల శాఖ మాజీ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు, రెండు హైస్కూళ్ళ కు చెందిన ఉపాధ్యాయులు జి.కె. సునీత, ఎవివి సత్యనారాయణ, అనంతలక్ష్మి ,కృష్ణవేణి పాల్గొన్నారు.

## ఏలూరు నుండి బిజెపి అభ్యర్థి గెలిస్తే డబుల్ ఇంజన్ అభివృద్ధి

**ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్**







**చింతలపూడి,మేజర్ న్యూస్:**కేంద్రంలో మూడోసారి మోడీ ప్రధాని కావడం ఖాయమని ఏలూరు ప్రాంత అభివృద్ధికి గారపాటి చౌదరిని ఏలూరు పార్లమెంటు సభ్యునిగా గెలిపించుకుంటే డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధ్యమవుతుందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. జబర్దస్త్ టీమ్, సినీ గాయకులతో కూడిన బృందం గురువారం చింతలపూడి మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి తరుపున ప్రచారం నిర్వహించి సందడి చేసింది. చింతల పూడి మండలంలోని ఎర్రగుంటపల్లి, రాఘవపురం, ప్రగడవరం, చింతలపూడి పట్టణ పరిధిలో పర్యటించి ప్రధాని మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి, 16 సంవత్సరాలుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు,బాబీ, వినోద్ (వినోదిని), ఇమ్మాన్యుయేల్ కామెడీ షోతో అలరించారు. సినీ గాయని గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య పాడిన పాటలు స్థానికులల్లో ఉత్సాహం నింపాయి. గత పది సంవత్సరాలుగా మోడీ భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట వేంకట నారాయణ, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఏసు బాబు, చింతలపూడి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# "యు-డిజర్వ్-మోర్" కాంపైన్‌ని విడుదల చేసిన జియో-బీపీ

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జియో-బీపీ (రిలయెన్స్ బీపీ మొబిలిటి లిమిటెడ్ యొక్క ఆపరేటింగ్ బ్రాండ్, రిలయెన్స్ ఇండస్ట్రీస్, బీపీ యొక్క ఫ్యూయల్ మరియు రిటైలింగ్ ఆపరేటింగ్ బ్రాండ్ యొక్క ఉమ్మడి వాణిజ్యం), ప్రయాణాలకు ఒక ప్రముఖ సొల్యూషన్ ప్రొవైడర్, భారతదేశపు ఫ్యూయలింగ్ అనుభవాన్ని పెంచే తమ విలక్షణమైన కస్టమర్ ప్రతిపాదనలను చూపించే తమ యు-డిజర్వ్-మోర్ కాంపైన్ ను నేడు విడుదల చేసారు. 100వ స్వాతంత్ర్య దినోత్సవం దిశగా పరుగులు తీస్తున్న అమృత్ కాల్ ద్వారా, అంతర్జాతీయ శక్తి కోసం భారతదేశం ఉజ్జ్వలమైన కేంద్రంగా నిలుస్తుంది. భారతదేశానికి మరింత "ఎక్కువ" ఇవ్వడానికి, యు-డిజర్వ్-మోర్ (వైడీఎం) కాంపైన్ జియో-బీపీ నుండి విలక్షణమైన కస్టమర్ ప్రతిపాదనలను ప్రధానాంశంగా చూపించే కాంపైన్, పనితీరు, సేవలు, ఆధునిక సాంకేతికత యొక్క మూడు స్థంభాలు పై దృష్టి కేంద్రీకరిస్తుంది. వైడీఎం కాంపైన్ 4.3% వరకు అత్యధిక మైలేజీని అందచేసే డీజిల్ మరియు పెట్రోల్ ను అంతర్జాతీయంగా అభివృద్ధి చేసిన ఉన్నతమైన "యాక్టివ్" టెక్నాలజీ ద్వారా ఇంజన్స్ ను ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా 10 శుభ్రంగా ఉంచడమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న జియో-బీపీ పల్స్ ఈవీ ఛార్జింగ్ పాయింట్ నెట్ వర్క్‌తో పాటు ఉంటుందని తెలియచేస్తోంది. జియో-బీపీ మొబిలిటీ స్టేషన్స్ లో దేశవ్యాప్త-నెట్ వర్క్‌లో ఇతర ప్రతిపాదనలలో స్నాక్స్, కన్ఫెక్షనరి మరియు ప్రయాణానికి అవసరమైన వస్తువులు కోసం 24X7 షాప్, అంతర్జాతీయ ఆన్-ద-మువ్ బ్రాండ్ వైల్డ్ బీన్ కేఫ్ ద్వారా సిగ్నేచర్ కాఫీని కూడా ప్రధానాంశంగా ఉంటాయని తెలియచేసింది. తక్కువ కార్బన్ పరిష్కారాలతో దేశం కోసం ప్రయాణాలను పునః ఊహించిన తమ కలకు అనుగుణంగా, జియో-బీపీ కంప్రెస్డ్ బయోగ్యాస్, ఇథనాల్ ఆధారిత ఈ20 పెట్రోల్, ఈవీ బ్యాటరీ ఛార్జింగ్, స్వాపింగ్ సహా ఎనర్జీ ఆఫరింగ్స్ సమూహాన్ని కూడా జియో-బీపీ అమ్ముతుంది. మొబిలిటి స్టేషన్స్ ను మించి, జియో-బీపీ ఆటోమేషన్ తో ప్రోత్సహించబడే పిల్ ఫర్ ప్రూఫ్ మొబైల్ డిస్పెన్సర్స్ మరియు పేటెంట్ గల ప్యాక్డ్ హెచ్ డీపీఈ కంటైనర్స్ ద్వారా కస్టమర్స్ ఇళ్ల వద్ద డీజిల్‌ను తీసుకువెళ్లడంలో మార్గదర్శకత్వం వహిస్తుంది. వారి యొక్క నిరంతరమైన సులభమైన ఆర్డరింగ్, వాస్తవిక సమయంలో ట్రాక్ చేయడం, అనుకూలమైన డెలివరీ మార్గాలు, జియో-ట్యాగింగ్ లు, భారతీయ కస్టమర్స్ సురక్షితమైన మరియు నాణ్యతతో కూడిన ఆన్-డిమాండ్ డెలివరీ చేయడంలో విశ్వాసం కలిగి ఉండేలా వీలు కల్పించింది. తక్కువ కార్బన్ ఈవీ పరిష్కారాల్లో, జియో-బీపీ వారి ఆందోళనరహితమైన జియో-బీపీ పల్స్ యాప్, డైనమిక్ లోడ్ షేరింగ్ మరియు ఆటో ఛార్జ్ ఫీచర్స్ దేశంలో ఈవీ అనుసరణను పెంచడంలో సహాయపడుతున్నాయి.


## యాత్ర టు సినిమాకి బైక్ ర్యాలీ





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** యాత్రటు సినిమా రిలీజ్ సందర్భంగా వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి పాలకొల్లు నియోజకవర్గం వైఎస్ ఆర్సిపి ఇన్చార్జి గుడాల గోపి ఆధ్వర్యంలో శ్రీనివాస డీలక్స్ థియే టర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు, పెద్ద ఎత్తున వైయస్సార్ అభిమానులు బైకులతో ర్యాలీలో పాల్గొని చిత్రాన్ని తిలకించడానికి వెళ్లారు, ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ గురువారం థియేటర్లో వేయబోయే నాలుగు షోలకు పైకం చెల్లించి అభిమా నులకు ఉచితంగా సినిమా ప్రదర్శనకు ఏర్పాట్లు చేసామని చెప్పా రు, గాంధీ బొమ్మల సెంటర్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి పూల దండలు వేసి నినాదాలు చేశారు, గోపి కుటుంబ సభ్యులతో వెళ్లా రు, బైక్‌ర్యాలీలో వైఎస్ఆర్సిపి యువకులు వివిధ దేవస్థానం చైర్మన్లు పాల్గొన్నారు

## 58 మంది ఆశ వర్కర్లకు భోజనాలు ఏర్పాటు చేసిన పోలీసులు



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** చలో అసెంబ్లీ ముట్టడికి ఆశ వర్కర్స్ తలపెట్టిన కార్యక్రమానికి వివిధ జిల్లాల నుండి వచ్చిన ఆశ వర్కర్ ని, విజయవాడ పోలీసులు వారిని అడ్డగించారు. ఈ కార్యక్రమానికి అనుమతులు లేని కారణంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన 58 మందిని కైకలూరు టౌన్ స్టేషన్ కి తరలించారు. ఆకలితో ఉన్న ఆశ వర్కర్స్‌కి సిఐ రఘు చొరవతో వారికి భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ పోలీసువారుఅంటేనే దౌర్జన్యా నికి మారుపేరని, వారికి మానవత్వం ఉండదని ఇప్పటివరకుఅనుకున్నామని, కానీ ఇటువంటి భోజన సదుపాయం ఏర్పాటు చేసిన ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగంకు కృతజ్ఞతలు తెలిపారు.

సూర్య
పశ్చిమ గోదావరి
శుక్రవారం
9 ఫిబ్రవరి 2024


# కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



**భీమవరం,మేజర్‌న్యూస్ :** కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, రైతులకు 2 లక్షల రూపాయలు రుణ మాఫీ ప్రకటించాలని,తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ అందచేయాలని,సమగ్ర పంటల భీమా పథకాన్ని అమలు చేయాలని, పంట నష్టానికి గురైన రైతులందరికీ ఆర్థిక సహకారమందించాలని,సార్వా ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎ.పి.కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ భీమవరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఎ.పి. రైతు సంఘం, ఎ.పి.కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిచి జిల్లా రెవెన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రైతే రాజు, రైతే దేశానికి వెన్నెముక అని చెప్పన పాలకులు రైతు సంక్షేమానికి చేసింది శూన్యమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎ.పి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, రైతు నాయకులు నామన వెంకటేశ్వరరావు,ఎం.లక్ష్మిపతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు, సనపల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్,సీఐతో జనసేన నేత బాలరాజు భేటీ





**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:** జీలుగుమిల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.వి వెంకటేశ్వరావు, జీలుగుమిల్లి సర్కులర్ స్పెక్టర్ టీ క్రాంతి కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవి కుమార్, పోలవరం నియోజకవర్గం ఇంచార్జి చిర్రి బాలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులతో మండల పరిస్థితిలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**ఏఎంసి చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్**

**పెంటపాడు, మేజర్ న్యూస్ :** పేదల పాలిట పెన్నిధిగా,ప్రజా ఆమోదం పొందిన సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఏఎంసి చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి , సంక్షేమ కార్యక్రమాల అమలుపై సదరు శాఖల అధికారులు వివరించారు. అగ్రికల్చర్ ఏవో పార్థసారథి తమ కార్యాలయం నందు ఎలుకల నివారణ మందు అందుబాటులో ఉందని పంట పొలాలను కాపాడుకోవడానికి రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, రావికుంట, ఆకుతీగపాడు దళితవాడల్లో రోడ్ల మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను మార్చాలని కోరగా, విద్యుత్ శాఖ ఏఈ పంచాయతీలో తీర్మానం చేసి ఆ నకళ్లను ఎంపీడీవో కి ఇవ్వాలని, తద్వారా మా దృష్టికి రావడంతో సమస్య పరిష్కరించగలమన్నారు. కస్పా పెంటపాడు సర్పంచ్ పి.సత్యనారాయణ తమ గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, అవి కరిచిన ప్రమాదం లేకుండా ముందుగా వ్యాక్సిన్ వేస్తే బాగుంటుందని, ఎన్‌ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలు ఎక్కువగా ఉన్నాయని మెజర్మెంట్ కరెక్టా ఇవ్వకపోవడం వల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతుందన్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ పేదల పాలిట పెన్నిధిగా ప్రజా ఆమోదం పొందిన ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు.

అధికారులు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు మధ్య వారధి వంటి వారని వీరు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ప్రజలకు మేలైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, తహసిల్దార్ ఎన్.సురేష్ బాబు, ఎస్సై బి.మోహన్ రావు, ఈఓపిఆర్డి ప్రసాద్, ఎంఈఓ టీవీ రామకృష్ణ,హౌసింగ్ ఏఈ డి.రాజేంద్ర కుమార్, డిఆర్డిఏ ఏపీఎం మహమ్మద్ పలువురు సర్పంచులు,ఎంపీటీసీలు,ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్లు కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలి



పెదవేగి,మేజర్ న్యూస్:విద్యుత్ మీటర్లు ఇకపై అవసరమైన వారు గ్రామ సచివాలయాలలోనే దరఖాస్తు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఝాన్సీ లక్ష్మి తెలిపారు. గురువారం పెదవేగిలోని విద్యుత్ ఉపకేంద్రంలో రైతులు, గ్రామ లైన్మెన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ అవసరమైన, లేక గృహ అవసరమైన విద్యుత్ మీటర్లు అవసరమైన వారు గ్రామ సచివాలయాలలో ప్రభుత్వాలు నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించి మీటర్లు పొందవచ్చునని, అదనంగా ఎవరికి ఎటువంటి రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి, పి శ్రీనివాసరావు, ఏఈ నాగ శేషుడు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాప్‌లో అక్రమ బియ్యం పట్టివేత



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** గుండుగొలను లోని రేషన్ షాపులపై నిర్వహించిన దాడులలో బియ్యం నిల్వల తేడాలు గుర్తించినట్లు పౌరసరఫరాల సంస్థ భీమడోలు డిప్యూటీ తహసిల్దార్ .ఎ. మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ, గుండుగొలను లోని రేషన్ షాపుల్లో బియ్యం నిల్వలలో తేడా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి గ్రామ రెవెన్యూ అధికారి గోవింద్ సహకారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎం గౌతమ్ కుమార్ పేర నిర్వహిస్తున్న రేషన్ షాప్ లో 250 కేజీల మేరకు బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. డీలర్ పై నిత్యవసర వస్తువుల చట్టం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ ఆదర్శనీయం

**జెడ్.పి ఛైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** జనవరి 26వ తేదిన డిల్లీలో జరిగిన గణతంత్రదినోత్సవ వేడుకలలో డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, పెదతాడేపల్లి విద్యార్ధులకు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు జెడ్.పి ఛైర్పర్సన్ ఘంట పద్మశ్రీ ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసి బ్యాండ్ టీంకి యూనిఫాం సమకూర్చినందుకు జెడ్.పి ఛైర్పర్సన్ వారికి పాఠశాల విద్యార్థులు మరియు ప్రిన్సిపాల్ కృతజ్ఞాతలు తెలియజేసారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటె భావిష్యతులో ఇలాంటి బహుమతులు మరిన్ని సాధిస్తాం అని విద్యార్థులు తెలియజేసారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా వైస్సార్సీపీ బి.సి. సెల్ అధ్యక్షులు ఘంట ప్రసాద్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, బ్యాండ్ టీం విధ్యార్ది గ్. దినేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కత్తుల రవి పాల్గొన్నారు.


# దెందులూరు,ద్వారకా తిరుమల రైతులతో విద్యుత్ అవగాహన సదస్సులు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** దెందులూరు మండల సెక్షన్ ఆఫీసులో అలాగే ద్వారకా తిరుమల మండల సెక్షన్ ఆఫీసులో గురువారం రైతులతో విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎగ్జికుటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏలూరు జె.పి.బి.నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం నందు ఆయన మాట్లాడుతూ కొత్త విద్యుత్ సర్వీసుల కొరకు ధరఖాస్తులను గ్రామ సచివాలయములో మాత్రమే నమోదు చేయవలెనని,అంచనా ఛార్జీలకు మించి ఎటువంటి అదనపు మొత్తాన్ని ఎవరికి చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. విద్యుత్ సమస్యల కొరకు 1912 నెంబరు కు ఫోన్ చెయ్యవలసిందిగా ఆయన కోరారు. ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన ముందస్తు భద్రతా చర్యలను రైతులకు తెలియ చేయడము జరిగిందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు, విద్యుత్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.


## కలెక్టరేట్‌లో అటెండర్‌గా కారుణ్య నియామకం

**– 21 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కారుణ్య నియామకం కింద ఆకివీడు మండలంలో పనిచేస్తూ గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులైన కుమారుడు కడిమి కిరణ్‌కు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న 21 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు,రవీంద్ర రాజు,రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ,ఏలూరు జిల్లా అధ్యక్షులు శ్రీరామచంద్రమూర్తి రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వీఆర్వోలుకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించినందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కి,జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యకి, డిఆర్ఓ పుష్పమణికి, కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావుకి, ఎ4 యశ్వంత్‌కి, గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం. కృతజ్ఞతలు తెలియజేయశారు.

## జగన్ బూటకపు బడ్జెట్ : తోట సీతారామలక్ష్మి



భీమవరం,మేజర్‌న్యూస్ :వైసీపీ జగన్ ప్రభుత్వం ఆర్థిక మంత్రి బుగ్గనతో ప్రవేశపెట్టిన బూటకపు బడ్జెట్ను ఏపి ప్రజలు హసాయించుకుంటున్నారని పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు భీమవరం నియోజ కవర్గ ఇన్చార్జ్ తోట సీతారామలక్ష్మి తెలిపారు.శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంచనాలు కొండంతగా ఉం డగా ఖర్చులు పిసిరంతో ఉన్నాయని 13 వేల కోట్ల రెవెన్యూ లోటును 60 వేల కోట్లకు పెంచిన ఘనత జగన్ సర్కార్కి దక్కుతుందన్నారు.వైసిపి జగన్ ప్రభుత్వం ఏపీ అప్పులు 11.58 లక్షల కోట్లు ఉండగా ఇతర శాఖల రుణ భారాలను సామాన్య ప్రజలపై పన్నులరూపంలో వేసి అత్యధిక పన్నులను వసూలు చేయడం జగన్ ప్రభుత్వానికే చెందిందని విమర్శించారు. జగన్ సర్కార్ కరెంటు బిల్లులను ఏడుసార్లు పెంచి నిత్యవసర సరుకుల రేట్లను అనేకసార్లు పెంచి సామాన్య మధ్య తరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని నాసిరకం మద్యంతో వేలాది మందిని పొట్టనపెట్టుకునిమద్యండబ్బుతోజగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు.

## 9న ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ రాచపట్నం రాక

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఈనెల 9వ తేదీ శుక్రవారం మ.11.50 గంటలకు కైకలూరు మండలం రాచపట్నం రానున్నారు. రాచపట్నం గ్రామ ంలో ఎస్‌సి కుటుంబానికి చెందిన భూమికి సంబందించి ఆక్రమణ పై విచారణ జరుపుతారు.అనంతరం మ.2.00 గంటలకు రాచపట్నం నుంచి బయలుదేరి విజయవాడ వెళతారు.

# దివిస్ లాబరేటరీకి 25 మంది ఎంపిక




**పాలకొల్లు, మేజర్ న్యూస్:**స్థానిక బిఆర్ఆర్అండ్‌జి కేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రముఖ ఫార్మ కంపెనీ డివిస్ లాబరేటరీస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు, దీనికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి 65 మంది అభ్యర్థులు హాజరైనారు ఈ ప్రాంగణ ఎంపికలను దివిస్ ల్యాబ్ హెచ్‌ఆర్ పూర్ణ ప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించి 25 మందిని ఎంపిక చేసినారు. వీరికి పిఎఫ్, ఈఎస్ఐ, హెచ్‌ఆర్ లాంటి అలివేన్స్‌తో కలిపి నెలకి రూ 28, వేలు వేతనంగా అందజేయబడు నని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామరాజు మాట్లాడుతూ నిర్దిష్ట లక్ష్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటలో తమ కళాశాల ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఈ ప్రాంగణ ఎంపికకు ఎంపికైనటువంటి విద్యార్థులను అభినందిస్తూ కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు వృత్తి నైపుణ్యాలు విద్యార్థులకు అత్యంత ముఖ్యమని, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ, పాఠ్యాంశాలపై పూర్తిపట్టు సాధించగలిగిన రోజున మంచి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చు కోవచ్చునని ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తావించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ లక్ష్మణరావు ,కెమిస్ట్రీ అధ్యాపకులు శివన్నారాయణ , సిఆర్‌టి అధ్యాపకులు సంతోష్ పాల్గొన్నారు

# మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**– జమాతె ఇస్లామీ హింద్ రాష్ట్ర స్థాయి అవగాహనా ఉద్యమం**





**భీమవరం,మేజర్‌న్యూస్ :** మత్తు పదార్థాల సేవన సమస్య మన భారతదేశాన్నే కాదు, ప్రపంచ దేశాలకే సవాలుగా మారింది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఈ మత్తు పదార్థాల బారినపడి తమ బంగారు భవిష్యత్తు చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. అవగాహన కల్పించి మత్తు పదార్థాల నిర్మూలనతో ఉత్తమ సమాజాన్ని స్థాపించేందుకు జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుండి 18వ తేదీ వరకు రండి ! మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ఒక రాష్ట్ర స్థాయి అవగాహనా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు జమాతె ఇస్లామీ హింద్ పట్టణ ఉద్యమ కన్వీనర్ మహమ్మద్ సిద్దీఖ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా అంకాల్ ఆర్ట్ అకాడమీలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రపంచ దేశాలతోపాటు మన దేశంలో కూడా మత్తు పదార్థాల సేవనం రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుందన్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ కరపత్రాలు సోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం, క్యాంపస్ లెక్చర్లు, కార్నర్ మీటింగ్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు,బహిరంగ సభలు,వ్యాసరచన పోటీలు, షాట్ ఫిల్మ్ మేకింగ్ కాంపిటీషన్లు ఏర్పాటు చేసి విజేతలకు నగదు బహుమతులు అందజేయుటకు నిర్ణయించడం జరిగిందని ఆయన తెలియజేశారు. ఇందులో పాల్గొనదలచినవారు సెల్:9848677137 లేదా 9703124568నంబర్లపై సంప్రదించాలని కోరారు.

# అభివృద్ధి చేయడం అంటే శిలాఫలకాలు వేయడం కాదు



**ఏలూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** అభివృద్ధి చేయడమంటే శిలాఫలకాలు వేసి ప్రజలను మభ్యపెట్టడం కాదని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బడేటి చంటి ఎద్దేవా చేశారు. వైసిపి హయాంలో ఏలూరు నగరం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఏలూరు వెంకన్న చెరువు స్మశాన వాటికను టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్య తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ఏలూరు మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి ఈ స్మశాన వాటిక అభివృద్ధికి ఏర్పాటు చేసిన శిలాఫలకానికి వైసిపి నాయకులు రంగులు వేయడాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ అభివృద్ధి చేయడం చేతకాని పాలకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఇటువంటి చర్యలకు పాల్పడతారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవసాన దశలో ప్రతి ఒక్కరు వెళ్ళాల్సింది స్మశానానికేనని ఈ విషయాన్ని గుర్తించకుండా కనీసం స్మశానంలో సౌకర్యాలు కల్పించే విషయంలో కూడా పాలకులు నిర్లక్ష్యం చూపడం బాధాకరమన్నారు. ఎంతో మంది దాతలు వెంకన్న చెరువు స్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని,అయితే పట్టింపులకు పోవడం వలన స్మశానంలో ఎటువంటి సౌకర్యాలు లేకుండా పోయాయన్నారు. స్మశానాలను అభివృద్ధి చేసి తీరుతామని అటు ఏలూరు ఎమ్మెల్యే, ఇటు కార్పొరేషన్ పాలకులు ప్రగల్భాలు పలికారు తప్ప ఏ ఒక్క సౌకర్యాన్ని కల్పించలేకపోయారని ఆయన మండిపడ్డారు. ఇదే సమయంలో అశోక్ నగర్లోని స్మశాన వాటికలో ప్రజల సౌకర్యార్థం ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఓర్వలేని తనంతో పాలకులు వాటిని విధ్వంసం చేయడం వారి నైజంను తేటతెల్లం చేస్తుందని బడేటి చంటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి స్మశానాలను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చోడే వెంకట రత్నం, పూజారి నిరంజన్, దాసరి ఆంజనేయులు, మారం అను, తవ్వా అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల ఛలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు



**పాలకొల్లు, మేజర్‌న్యూస్:**తమ న్యాయమైన కోర్కెల సాధనకై ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా పాలకొల్లులో గురువారం విజయవాడ బయలుదేరిన ఆశ వర్కర్లను పట్ల పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్లో రైలు ఎక్కకుండా అడ్డుకుని పట్టణ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. జగన్ ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకొని మా గొంతులు నొక్కుతుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ వర్కర్లకు పనికి తగ్గ వేతనం కనీసం 26, వేలు చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని, పదవి విరమణ ప్రయోజనాలు కల్పించాలని, పిఎఫ్ ఈఎస్ఐ సదుపాయాలు అమలు చేయాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు మద్దతుగా పోలీసు స్టేషన్ కు టిడిపి నాయకులు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షుడు జీవీ మాట్లాడుతూ ప్రభుత్వానికి తమ న్యాయమైన కోర్కెలను మొరపెట్టుకునేందుకు వెళ్తున్న ఆశా వర్కర్లను మహిళలని కూడా చూడకుండా పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం అమానుషము దుర్మార్గమని పేర్కొన్నారు. రాబోయేది టిడిపి జనసేన ప్రజా ప్రభుత్వమేనని, న్యాయమైన కోర్కెలను తీరుస్తాననే బాధ్యత ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తీసుకుంటానని చెప్పమన్నారని జీవి తెలిపారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చేట్టి బాబు మాట్లాడుతూ ఎన్నికల పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని అమలు జరపమని ఆశా వర్కర్లు అడుగుతుంటే వినబడని చెవిటి ప్రభుత్వంగా మారిందన్నారు. పల్లెటూర్లలో వైద్యం అందించే ఆశా వర్కర్లకు రూ 10, వేలు వేతనం వెట్టి చాకిరి చేయించుకోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలోపెచేట్టి వెంకట నరసింహ రావు (బాబు), గండేటి వెంకటేశ్వర రావు, అల్లం తాతాజీ, సలాది బాబులు నాయుడు, చామంతుల సత్యనారాయణ.


# రైతుల రుణాలు మాఫీ చేయాలి

**– ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్**




**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :**అనావృష్టి, అతివృష్టితో నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్, రెవిన్యూ డివిజన్ కేంద్రాల వద్ద రైతులను ఆదుకోవాలని కోరుతూ ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పిలుపుమేరకు స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.మోడీ గత ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, రైతుల ఆత్మహత్యలు నివారిస్తానని వాగ్దానం చేసి అధికారం చేపట్టిన తర్వాత రైతులను నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డిఓ కే.అద్దయ్యకు రైతు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా నాయకులు చిలపరెడ్డి వెంకట రెడ్డి,జమ్మి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసు, ఎస్ కే బాజీ, చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు



భీమడోలు, మేజర్ న్యూస్ : వ్యవసాయ,ఇతర విద్యుత్. నూతన సర్వీస్స్.లకోసం ఇకపై గ్రామ సచివాలయాల ద్వారా మాత్రమే నమోదు చేసు కోవాలని, విద్యుత్ శాఖ ఏలూరు ఇ.ఇ. నటరాజన్ సూచించారు. భీమడోలు ట్రాన్స్ కోసెక్షన్ కార్యాలయంలో ఎ.ఇ. రామస్వామి అధ్యక్షతన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు గురువారం సాయంత్రం ట్రాన్స్‌కో,వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ ఇ.ఇ. హాజరయ్యారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తుదారులు తమ పేర్లను గ్రామ సచివాలయాల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఈ సంద ర్భంగా ఎస్టిమేట్ చార్జీల మినహా ఏ విధమైన ఇతర చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదన్నారు. దీనివల్ల దళారుల ప్రమేయం తగ్గి, విద్యుత్ సర్వీసుల కేటాయింపు పారదర్శకంగా ,నేరుగా జరుగుతుందన్నారు. ఇదే సందర్భంగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు లో వోల్టేజీ ఇతర సమస్యల పరిష్కారం కోసం ఐ ఎస్ ఐ ముద్రగలిగిన కెపాసిటర్ బ్యాంకులు, వ్యవసాయ బోర్ ఫుట్ వాల్వులు , పైపులు వినియోగించాలని కోరారు. భీమడోలు మండల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు పెండింగ్ లేదని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్కో కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ ,భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్ పి వి ఉషారాణి పాల్గొన్నారు.